డిమాండ్‌లు పరిష్కరించలేదని నిట్టూర్పు..

కోటి సంతకాలతో కనివిప్పు..!

- సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీల డిమాండ్
- 'జగనన్నకు చెబుదాం' అంటూ సంతకాల సేకరణ
- 33వ రోజుకు చేరుకున్న దీక్ష

కార్వేటినగరంలో..

ప్రజాశక్తి-కార్వేటినగరం

అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శనివారం కార్వేటినగరంలో 'జగనన్నకు చెపుదాం కోటి సంతకాల సేకరణ' కార్యక్రమాన్ని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, ప్రాజెక్టు కార్యదర్శి కె.మమత ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్చలు సందర్భంగా ప్రభుత్వం మీనవేషాలు వేస్తున్నదని ఫలితాలు వచ్చే విధంగా చర్చలు జరుపుకుండా దౌర్జన్యం చేసే పద్ధతిలో ఉందని విమర్శించారు. ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి 1,05,000మంది మహిళలను బెదిరింపులకు పాల్పడుతూ అందరినీ తొలగిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టంపై గౌరవం లేదా అని ప్రశ్నించారు. తొలగించడానికి ప్రభుత్వానికి ఏం హక్కు ఉందన్నారున. చట్టబద్ధంగా సమ్మె చేస్తుంటే అడ్డదారుల్లో ఎస్మా చట్టం తీసుకువచ్చి నోటీసులు ఇచ్చి భయపెట్టే పని చేయడం దుర్మార్గమన్నారు. ఎన్ని రకాల నిర్బంధాలు ప్రయోగించినా మహిళలు బెదరకుండా సమ్మె కొనసాగిస్తున్నారని దీనిని చూసి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్వేటినగరం, నగిరి ప్రాజెక్టులలో సర్పంచుల ద్వారా అధికారులు ఒత్తిడి తెప్పించి కొత్తవారిని నియమించుకోవడానికి రంగం సిద్ధం చేశామని నోటిఫికేషన్స్ ఇస్తామని బెదిరింపులకు పాల్పడడం చూస్తే సిగ్గుచేటుగా ఉందన్నారు. అధికారులు హద్దు మీరి ప్రవర్తిస్తున్నారని హెచ్చరించారు. శిబిరాల దగ్గరకు వచ్చి బెదిరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం చెప్పిన నినాదమే జగనన్నకు చెబుదామని కార్యక్రమాన్ని అంగన్వాడీలు ప్రారంభించారని కోటి సంతకాల సేకరించి ప్రభుత్వానికి పంపుతామని అప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు లక్ష్మీ నరసమ్మలతో పాటు అంగన్వాడీలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో అంగన్వాడీలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. యూనియన్ నాయకులు శకుంతలమ్మ మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్‌లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు.

పలమనేరు: అంగన్వాడీల సమ్మె 33వ రోజుకు చేరుకుంది. శనివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. మాజీ మంత్రి మాట్లాడుతూ 33 రోజులుగా నిరవధికంగా సమ్మె చేస్తున్నటువంటి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా సమ్మె చేస్తుంటే ఎస్మా ప్రయోగించి ఇబ్బందులు గురిచేయడం సరికాదన్నారు. నిరసన కార్యక్రమంలో సిఐటియు, ఐఎడబ్ల్యుయు నాయకులు గిరిధర్ గుప్తా, ఓబులరాజు అధ్యక్షతన జరిగినది.


పలమనేరులో..

బైరెడ్డిపల్లిలో..

ఓటు.. మన రైట్..

- వినూత్నంగా ఓటు ఆవశ్యకతపై అవగాహన
- పతంగులు ఎగరేసిన నగరపాలక అధికారులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగరపాలక ఆధ్వర్యంలో ఓటు హక్కుపై వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సంక్రాంతి పురస్కరించుకొని ఓట్ ఇస్ రైట్.. ఓట్ ఫర్ ష్యూర్.. ఓటు వజ్రాయుధం.. అంటూ రాసిన నినాదాలతో కూడిన పతంగులను ఎగురవేస్తూ ఓటు హక్కుపై అధికారులు అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2024 కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఆదేశాల మేరకు.. నగర కమిషనర్, ఏఈఆర్వో డాక్టర్ అరుణ మార్గనిర్దేశంలో నగరపాలక అధికారులు శనివారం చిత్తూరు మెసానికల్ మైదానంలో యువత, విద్యార్థులతో కలిసి గాలిపటాలను ఎగరవేశారు. ఓటు హక్కు విలువను తెలియజేసేలా నినాదాలను రాసిన గాలిపటాలను యువత, విద్యార్థుల చేత ఎగురవేయించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ గోవర్ధన్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటు హక్కు ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహం, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

కళ తప్పుతున్న సంక్రాంతి

- హరిదాసులేరి...?
- ఆ గంగిరెద్దుల రంకెలెక్కడ...?

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

సంక్రాంతి అంటే తెలుగువారికి ముఖ్యమైన పండుగ వీధివీధిన, ప్రతి ఇంటి ముందు రంగురంగుల రంగవల్లిలు, గొబ్బెమ్మలు, హరిదాసులు కీర్తనలు, అందంగా ముస్తాబైన గంగిరెద్దుల రంకెలు, చెరుకులు, మామిడి తోరణాల అలంకరణలతో పాటు భోగిమంటలతే ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కల్గించే రీతిలో పండుగ జరిగేది.. రాను.. రాను.. అవి అన్ని కనుమరుగువుతున్నాయని అన్నారు. హరిదాసులు అనే వారే కరువయ్యారు. గంగిరెద్దులు రంకెలు మూగబోయాయి. కళకళలాడే పల్లెల్లో సైతం సంక్రాంతి కళ తప్పుతుండడం శోచనీయం.

పాతికేళ్ల క్రితం సంక్రాంతి అంటే సంతోషం. అనుబంధం. అభిమానం. ఆత్మీయత, అనురాగం కలబోసిన పండుగ. చేతికొచ్చిన వరి పంటను కోత కోసి, కుప్పలూడ్చి, ఇళ్లకు చేర్చి, పక్కానికొచ్చిన చెరుకు పంటను బెల్లంగా మార్చి చేతికందిన పంటల ఆనందంతో రైతుబిడ్డలు, కూలీలు ఆనందంగా చేసుకునే పండుగ సంక్రాంతి. సంక్రాంతి పండుగ అంటే ప్రతి పల్లెలో ఆనంద హేళీ. నాలుగు రోజుల పాటు జరుపుకునే అతిపెద్ద పండుగ. కొత్త అల్లులు, కోడళ్లు, బావ బామర్దులు, అత్తామామలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరు ఒక చోట చేరి జరుపుకునే ఆనంద హేళి. ప్రతి ఇంటి ముందు మామిడి తోరణాలు, చెరుకు గడుల అలంకరణ, రంగురంగుళ ముగ్గులు, ముగ్గు మధ్యన పూలతో అలంకరించిన పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, భోగి మంటలు, ప్రతి అమ్మాయి పదహారు అణాల ఆడపడుచులా ముస్తాబై అలంకరణలు చేస్తూ, మరోపక్క హరిదాసులు తలపైమంత పెట్టుకుని, చేతితో తాంబుర వాయిస్తూ వేకువజామునే సూర్యుడు కంటే ముందే ఇంటి ముందకు చేరుకుని హరికీర్తనలు పాడుతుంటారు. మరో పక్కల డూ డూ బసవన్న అంటూ సన్నాయి వాయిస్తూ అందంగా అలంకరించిన గంగిరెద్దులను వీధుల్లో తిప్పుతూ అయ్యవారికి దండం పెట్టు.. అమ్మవారికి సలామ్ చేయి అంటూ గంగిరెద్దుల ఆటలు. మరో పక్క పిల్లలంతా కలిసి గాలిపటాలు ఎగురవేస్తారు. తొడు అళ్లులంతా ఆరబయట అరుగుమీద కుర్చోని మరదళ్లను ఆటపట్టిస్తూ, కొత్త అల్లులకు తలంటి స్నానాలు చేయిస్తూ, భోగిమంటలు వేస్తూ ఎంతో హుషారుగా పండుగ జరుపుకుంటారు. మరుసటి దినం సంక్రాంతి రోజున ఇంటిల్ల పాది ఉదయాన్నే లేచి తలంటి స్నానాలు చేసి, ఇళ్లంతా అలంకరించి, పెద్దలకు, పితృదేవతలకు తర్పనం చేస్తారు. పిండివంటలు వండి ఆరగిస్తారు. గొబ్బిల్ల పాటలు పాడుతూ గొబ్బితడుతూ ఆ రాత్రంతా తొక్కుడు బిల్లు, కబాడి, ఇతర గ్రామీణ ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ సంతోషంగా జరుపుకుంటారు.

మరిసటి దినం కనుమ రోజు ఇంటి ముందు ఉన్న గోవులను శుభ్రం చేసి, వాటికి రంగులు పూసి, రంగురంగుల కాగితాలతో, తళకు తోరణాలు చుట్టి అలంకరిస్తారు. ఊరిలో ఉన్న పశువులన్నిటిని ఒక చోట చేర్చి చుట్టు తిప్పుతారు. కాటంరాజు దేవుడికి పొంగళ్లు పెట్టి, సంవత్సరం అంతా తమ పశువులును, కుటుంబాన్ని కాపాడి, పాడిపండలతో గ్రామాలు పచ్చగా ఉండేలా చూడాలని పూజలు చేస్తారు. కొన్ని ఊళ్లల్లో జల్లికట్టు నిర్వహిస్తారు. మరికొన్ని ఊర్లలో కోడి పందాలను నిర్వహిస్తారు. ఆ మరుసటి రోజు దూడలకు పండుగ చేస్తారు. ఇలా నాలుగు రోజుల పాటు పండుగ జరుపుకునేవారు. రాను రాను.. ఆ కళ తప్పుతోంది. పదేళ్ల క్రితం వరకు కాస్తో కూస్తో సంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ. కాస్త కనుమరుగవుతోంది. పోటీ ప్రపంచంలో ఉరుకులు పరుగులు జీవనానికి అలవాటుపడ్డ యాంత్రిక జీవితానికి అలవాటు పడ్డ ప్రజలు ఆనందానికి దూరమవుతున్నారు. మూడు నాలుగు రోజుల పాటు వరస సెలువులు వస్తాయనే ఉద్దేశంతో సొంతూర్లకు వచ్చి పోవడం, తూతూ మంత్రంగా భోగి మంటలు వేయడం, అక్కడక్కడ జల్లుకట్టు నిర్వహించడం తప్ప, గంగిరెద్దులు, హరిదాసులు, పొంగళ్లు, తదితరవి ఆగుపించడమే లేదు. సాంప్రదాయ పండుగలో సైతం సాంకేతికను జోడించి, కొత్త పద్దతుల్లో సినిమాలు, షికార్లు, బైక్‌రేసులు, ట్యాబులతో ఆటలకు పరమితమవుతున్నారు. కాస్తోకూస్తో సమయం దొరికితే షాపింగ్‌లకు సమయాన్ని కేటాయిస్తున్నారు. ఇక పాతకాలపు సంప్రదాయ పద్ధతుల్లో పండగ జరుపుకోవడం ఎక్కడ...? పెద్దలు సంక్రాంతి సంబరాల గురించి, పండగ విశిష్టత గురించి పిల్లలకు వివరించి, గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణంలో పండుగ జరుపుకునేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

కొట్టి.. కేసులు పెట్టి

- బీసీవై పార్టీ నేతలపై పోలీసుల దుశ్చర్య
- రామచంద్రాయదవ్‌తో సహా 30 మందిపై కేసు నమోదు
- పోలీసుల తీరుపై మండిపడ్డ బీసీవై పార్టీ అధినేత

ప్రజాశక్తి-పుంగనూరు

ప్రైవేటు భూమిలోకి చొరబడ్డారు. ఇష్టానుసారం భూతులు మాట్లాడారు. అడ్డు వచ్చిన వారిపై పిడిగుద్దులు కురిపించారు. బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనాల్లో కుక్కారు. చెప్పులతోనూ కొట్టారు. చివరకు తిరిగి కేసులు పెట్టారు. ఇదీ పుంగనూరులో పోలీసుల ప్రవర్తన. యావత్ పోలీస్ శాఖకే మచ్చతెచ్చేలా ప్రవర్తించారంటూ పలువురి విమర్శలు వెల్లువెత్తాయి. ధర్మపోరాట సభను అడ్డుకొని.. అడ్డొచ్చిన వారిని కొట్టుకుంటూ తీసుకెళ్లడమే కాకుండా 30 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్రా యాదవ్ పోలీసుల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పుంగనూరు పెద్దిరెడ్డి జాగీరు కాదు. పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా ప్రవర్తిస్తున్నారు. సభకు ఏర్పాట్లు చేస్తున్న మా పార్టీ కార్యకర్తలపై దురుసుగా ప్రవర్తించారు. అమానవీయంగా వ్యవహరించారు. పోలీసుల్లా కాకుండా పెద్దిరెడ్డి సొంత మనుషుల్లా వ్యవహరించారు. మానవ హక్కులను కాలరాస్తూ మా కార్యకర్తలను చెప్పులతో కొట్టారు. మా వారిపై దాడి చేసి గాయపరిచి మళ్లీ మాపైనే తప్పుడు కేసులు పెట్టారు. శాంతికి పోలీసులు విఘాతం కలిగిస్తున్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ పోలీసులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఎర్రచందనం దొంగలను పట్టుకునే దమ్ములేని పోలీసులు.. మా పై ప్రతాపం చూపుతున్నారు. పోలీసుల ఆగడాలను ఇక కాలం చెల్లింది. పుంగనూరులోనే కచ్చితంగా సభ పెడతాను. పెద్దిరెడ్డి అరాచకాలను ఎండగడుతాను. నా నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతాను. ప్రజలే నా బలం" అని రామచంద్రయాదవ్ తెలిపారు.

తాయిలాల పరంపర.. ఓటరుకు ఎర

ప్రజాదృష్టి

- పెద్ద పండుగ పూట కానుకలే కానుకలు
- ఓటరును ప్రసన్నం చేసుకొనే పనిలో అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

ఎన్నికల సమీపిస్తున్న వేల తెలుగువారి పెద్ద పండుగను పురస్కరించుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఢీఅంటే.. ఢీ అన్నట్లుగా సంక్రాతి శుభాకాంక్షలు తెలుపుతూ బ్యానర్లు, ఫ్లెక్సీలు వెలుస్తున్నారు. టికెట్లను ఆశిస్తూన్న ఆశావాకులు వారి అనుచరలు పెద్ద ఎత్తును రోడ్లుకు ఇరువైపులు భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల కోడ్ తరువాత ఓటర్లును ఆకట్టుకొనేలా తాయిలాల పంపిణీ చేయడం సాధ్యం కాకపోవడంతో సంక్రాంతి సందర్భంగా కొత్తబట్టలు, నిత్యవసరాలతో ఓటర్లకు ఎరవేస్తున్నారు. తాయిలాలు అందిస్తున్న నేతలంతా వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు చేయాలంటూ ముందస్తు ప్రచారాన్ని ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో తమ పార్టీకి అనుకూలంగా ఓట్లు వస్తాయనే ప్రాంతాలపై కేంద్రీకరించి పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీలు గ్రామ, మండల స్థాయిలో పార్టీ ఇన్‌చార్జీల నుండీ ఓటర్లును ఆకట్టుకొనేందుకు రాజకీయ ప్రచారానిక తెరతీశారు. అభ్యర్థుల ఎంపికలో ప్రతిపక్ష పార్టీ ఆచీతూచి అడుగులు వేస్తోంది. అధికార పార్టీ ఇప్పటికే ఇన్‌చార్జీలను ప్రకటించింది దాదాపు ఇన్‌చార్జీలకు టికెట్ వచ్చే అవకాశం ఉండటంతో ప్రజల్లో విస్తృతంగా తిరుగుతూ ఆయా ప్రాంతాల్లోని తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ బిజిబిసిగా ఉంటున్నారు. నియోజకవర్గాల వారిగా ఏఏ కులానికి ఎంత మంది ఓటర్లున్నారు. కులనాయకుల ద్వారా తమ పార్టీ ఓట్లు పడేలా కులనేతలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని విందులు. వినోదాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏదైతేనేం.. ఈ సంక్రాంతి రాజకీయ సంక్రాంతిగా మారిపోయింది.

గ్రామాల్లో పందేలకు సిద్ధం

అరెస్టులకు పోలీసులు

- కత్తికట్టి సిద్ధమవుతున్న పందెం కోళ్లు
- జల్లికట్టుకు కాలుదువ్వుతున్న కోడెగిత్తలు
- ఎన్నికల వేళ ప్రోత్సహించేందుకు సన్నద్ధమవుతున్న నేతలు
- పందేలు నిర్వహిస్తే చర్యలకు సిద్ధమవుతున్న పోలీసులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్

సంక్రాంతి వచ్చేసింది.. పందెం రాయుళ్లకు పండుగొచ్చింది.. జల్లికట్టు, కోడిపందేలు, జూదాలకు గ్రామాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అసలే ఎన్నికల సమయం కావడంతో ఈ ఏడాధి నాయకుల జోక్యం, ప్రోత్సాహం ఉంటుందనే వాదనలున్నాయి. అధికార, పార్టీ నాయకులు గ్రామీణులను ఆకట్టుకొనేందుకు పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. కాగా మూగ జీవులను హింసించి పందేలు నిర్వహిస్తే కఠినంగా కేసులు నమోదు చేస్తామని పోలీసులు విస్తృతంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో పోలీసులు పటిష్ట నిఘాతో సంసిద్ధమయ్యారు.

కోడికూతతో నిద్రలేపే కోడిపుంజులు కైయ్యానికి కాలుదువ్వుతుంటే.. పౌరుషం పేరుతో కొడెగిత్తలను పరుగులు పెంటించనున్నారు. గతంలోనూ పోలీసులు జల్లికట్టు, కోడిపందెలను నిషేధిస్తున్నట్లు ప్రకటించినా సాంప్రదాయ ఆట పేరుతో అనేక ప్రాంతాల్లో అడ్డుకట్ట వేయలేకపోయారు. గ్రామీణ ప్రాంతాలోని పొలాలు, మైదానాలు ఎంపిక చేసుకొని ఈ క్రీడలను నిర్వహిస్తున్నారు. వీటి వెనుక స్థానికంగా ఉండే రాజకీయ నేతలు అండగా నిలుస్తున్నారు. రాజకీయ నేతల అండతో నిర్వహిస్తున్న వీటిని పోలీసులు చూసిచూడన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఉన్నోళ్ళకు ఆనందం - పేదోళ్ళు నాశనం

పోలీసులు కళ్ళుగప్పి నిర్వహిస్తున్న కోడిపందెలు.. పేకాట ఇతర జూదరుల క్రీడలు ఉన్నోళ్ళకు అనందం పేదళ్ల జీవితాలను నాశనం చేస్తున్నాయి. సంక్రాంతికి ముందుగానే జిల్లాలో కోడిపందేల జోరందుకున్నాయి. సంప్రదాయం ముసుగులో గతితప్పుతున్న పరిస్థితులపై పోలీసులు, రెవిన్యూ, పశుసంవర్ధకశాఖ పైపైన కేసులు పెడుతున్నరని జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ సంక్రాంతి కోడి పందేలు, జల్లికట్టు రాజకీయ రంగుపులుముకోనుంది. జిల్లాలో జల్లికట్టు, కోడిపందెలాపై పోలీసు, రెవిన్యూ యంత్రగం గట్టి చర్యలు తీసుకొని అరికట్టాలని కోరుతున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలపై దృష్టిపెట్టాలని జంతుప్రేమికులు కోరుతున్నారు.

అల్లికట్టు నిర్వహించరాదు: సిఐ సత్యబాబు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని కాపు మొండివెంగణపల్లిలో భజన గుడిలో జల్లికట్టు నిర్వహించకూడదని పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్యబాబు మాట్లాడుతూ గ్రామంలో జల్లికట్టు నిర్వహించరాదని ఆయన తెలియజేశారు జల్లికట్టు చట్ట విరుద్ధమని చెప్పారు. గ్రామాల్లో పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉల్లంఘిస్తే ఉక్కుపాదమే..

జిల్లాలో జల్లికట్టు, కోడి పందేలు, జూదం నిషేదం. పోలీసుల ఆంక్షలు ఉల్లంఘిస్తే ఉక్కుపాదం మోపుతాం. పందేలు అరికట్టేందుకు మండల స్థాయి తహశీల్దార్, ఎస్ఐ జంతు సంక్షేమ బోర్డు సిబ్బంది, ప్రత్యేక బృందంగా నిఘా ఏర్పాటు చేశాం. ప్రజలందరూ అధికారులకు సహకరించి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. మూగ జీవాలను హింసించే పనులు మానుకోవాలి. ఆంక్షలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు తప్పవు. పందేలు నిర్వహిస్తే 100, పోలీస్ వాట్సప్ నెంబర్ 9440900005కు సమాచారం అందించాలి.

- జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

డ్రోన్ ఎగుర వేయడంపై స్పందించిన సివిఎస్ఓ

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో కలకలం రేపిన డ్రోన్ కెమెరా వీడియో చిత్రీకరణ అంశంపై టీటీడీ స్పందించింది. హర్యానాకు చెందిన ఓ జంట తిరుమల నుండి తిరుపతికి ప్రయాణించే డౌన్ ఘాట్ రోడ్డులో 53వ మలుపు వద్ద నిల్చుని డ్రోన్‌ను ఎగురవేసి వీడియో చిత్రీకరిస్తూ మీడియా ప్రతినిధి కంట్లో పడ్డాడు. మూడంచెల భద్రతా తనిఖీలను దాటుకొని, సదరు భక్తుడు తిరుమలకు డ్రోన్ కెమెరా తీసుకురావడంపై విజిలెన్స్ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. కాగా మీడియా ప్రసారాల ద్వారా సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ అధికారులు డ్రోన్ ఎగురవేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్దగల డ్రోన్‌ను సీజ్ చేశారు. భారత భద్రతాదళానికి సంబంధించిన దినేష్ ఉద్దేశపూర్వకంగా డ్రోన్ కెమెరా ఎగర వేయలేదని, దినేష్ రెండు నెలలుగా సెలవులు మీద దక్షిణ భారత దేశాన్ని పర్యటిస్తున్నారని తిరుమల నిబంధనలు అతనికి తెలియదని టీటీడీ ముఖ్యనిఘా మరియు భద్రత అధికారి నరసింహ కిషోర్ తెలిపారు. మొదటి ఘాట్ రోడ్డులో 53వ మలుపు వద్ద ఎగరవేసిన డ్రోన్ కెమెరాను సీజ్ చేశామన్నారు. మూడు గంటల పాటు దినేష్‌ను విచారించామన్నారు. బ్యాటరీతో నడిచే పూర్తి ప్లాస్టిక్ బాడీకి సంబంధించిన డ్రోన్ కెమెరా కావడంతో ఎలాంటి ప్రమాదం లేదన్నారు.

శ్రీసిటీని సందర్శించిన అడిషనల్ డీజీపీ

ప్రజాశక్తి -వరదయ్యపాలెం:

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఎడిజిపి), రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్ సింగ్ శనివారం శ్రీసిటీని సందర్శించారు. ఆయన భార్య, ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ ఇంటీరియర్ డిజైనర్ ప్రియా సింగ్ కూడా ఈ సందర్శనలో పాల్గొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వీరికి సాదరస్వాగతం పలికి, శ్రీసిటీ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, ఇక్కడ భద్రతా వ్యవస్థ వివరాలను వారికి వివరించారు. తమ పర్యటనలో శ్రీసిటీ పరిసరాలను చుట్టిచూడడంతో పాటు క్రియా విశ్వవిద్యాలయం, రాక్‌వర్త్, ఎవర్టన్, హంటర్ డగ్లస్ పరిశ్రమలను సందర్శించారు.

కుప్పం నియోజకవర్గ బీసీ సెల్
ఉపాధ్యక్షులుగా చంద్రప్ప గౌడ్

ప్రజాశక్తి-గుడుపల్లి: గుడుపల్లి మండలంకి చెందిన చంద్రప్ప గౌడ్ వైసీపీ కుప్పం నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులుగా నియమితులైయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి రావడానికి సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, కుప్పం సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్‌కి, ఇతర నాయకులకి కృతఘ్నతలు తెలిపారు.

విజయానందరెడ్డిని కలిసిన పలువురి నేతలు

విజయానందరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: శ్రీరంగరాజుపురం మండలం పిల్లి గుండ్లపల్లె గ్రామానికి చెందిన మాజీ వాటర్ షెడ్యూల్ చైర్మన్ గుణశేఖర్‌నాయుడు అనుచరులతో ఏపీ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డిని కలిశారు. శనివారం చిత్తూరులో ఆయన నివాసంలో కలిసి ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మిట్టపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, హరిబాబు తదితరులు ఉన్నారు.

రెండవ విడత ట్యాబ్‌ల పంపిణీ

ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని రెండో విడత ట్యాబ్‌లు శనివారం పంపిణీ చేశారు. ప్రాథమికోనత, ఉన్నత పాఠశాల 205మంది 8వ తరగతి విద్యార్థులకు రెండన విడత ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణమ్మ, హెచ్.ఎల్.ఎన్.ప్రసాద్ సంయుక్తంగా తెలియజేసినారు. కార్యక్రమంలో కోటాల హెచ్‌ఎం ఆర్.యూసఫ్, టిచర్స్ కనకాచారి, నరసింహరెడ్డి, భాస్కరరెడ్డి, బాషా, కె.షణ్ముగం, సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, శ్రీనివాసులు, గౌస్, నదియా తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వం అందించిన ఉచిత ట్యాబులను ఎంఈఓ శ్రీరాములు శనివారం పాఠశాల సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి సోమశేఖర్, ఎంఐఎస్ అరుణ, మెసెంజర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సోమల: సోమల మండల ఎంఆర్పిఎస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా శనివారం ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆశయాలకు అనుగుణంగా నూతన కార్యవర్గం కార్యాచరణ చేపడుతుందని ఎమ్మార్పీఎస్ యువసేన మాజీ అధ్యక్షులు మాటూరు మురళి అన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి దుడ్డు రామకృష్ణ, పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రామనాథం, అధికార ప్రతినిధి అనిల్ కుమార్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ నీరుకొండ ప్రకాష్ హాజరయ్యారు. మండల అధ్యక్షులుగా వరగాని ప్రభుకుమార్, ఉపాధ్యక్షులుగా సురేంద్రబాబు, మండల ప్రచార కార్యదర్శిగా సుండు మణికంఠ, కార్యవర్గ సభ్యులుగా మణి, రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదే కార్యక్రమంలో నాయకులు పల్లె పోగు ప్రకాష్, కాగతి కృష్ణయ్య, తోటా లక్ష్మీనారాయణ, ఎద్దుల కృష్ణయ్య, వడ్డేపల్లి వెంకటరామయ్య, కార్యదర్శులుగా సుబ్రమణ్యం, వినాయక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని విజలాపురం పంచాయతీ, బాలఓబనపల్లి, 89 పెద్దూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తల మృతికి ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ ఆర్థిక సాయం అందించారు. శనివారం వారి భౌతిక కాయలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తక్షణసాయంగా రూ.10వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ బాబురెడ్డి, చంద్రారెడ్డి, మురుగేష్, కేశవరెడ్డి, చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీని గెలిపించండి'

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేసి వైసీపీని గెలిపించాలని ఎంపీపీ లతబాలాజీ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆశయాల సాధన కోసం కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు సైనికుడిలా పోరాటం చేసి పార్టీకి విజయాన్ని చేకూర్చాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో 2019 నుంచి జగనన్న అందించిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే జగనన్న ప్రభుత్వ పథకాలను అర్హులకు ఇంటి వద్దకే చేరవేయడానికి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ కూడా గొప్ప భవిష్యత్తు అందించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని గెలిపించుకునేందుకు అహర్నిశలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, జిల్లా కార్యదర్శి గోపినాధ్, జేసీఎస్ పురందర్, ధనశేఖర్ వర్మ, అమీద్, మునిక్రిష్ణ, ధన్రాజ్, మురగయ్య పలువురు పాల్గొన్నారు.

నారాయణ స్వామికే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి
- వైసీపీ నేతల డిమాండ్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు ఎమ్మెల్యే టికెట్ మళ్లీ డిప్యూటీ సీఎం నారాయణస్వామికే కేటాయించాలని మండల వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల పార్టీ అధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి, ఎంపీపీ అనిత విలేకరులతో మాట్లాడుతూ నారాయణస్వామి చేసిన సేవలు రానున్న శాసనసభ ఎన్నికల్లో ఆయనకు మరింత మెజారిటీ వస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు చిన్నమరెడ్డి, బలరామిరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, బాబునాయుడు, ఏకాంబరం, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామిరెడ్డివారిపల్లెలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కామిరెడ్డివారిపల్లె పంచాయతీ నందు శనివారం వికసితభారత్ సంకల్పయాత్ర గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తద్వారా ప్రజలకు ఏ విధమైన లబ్ధి చేకూరుతుందో సవివరంగా వివరించారు. కందూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి విజయలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆరోగ్య పథకాల గురించి పిఎంవివై, ఆరోగ్యశ్రీ పథకాల గురించి వివరిస్తూ ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అంటురోగాలు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలని క్షయ వ్యాధి, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ ఈఓ కుమార్ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ ప్రమీలమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని పంద్యాల మడుగులో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ టీడీపీ నేతలు శనివారం ఎన్‌టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామాలుతోపాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిరత్నం, మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, సత్యేంద్రశేఖర్, రామ్మూర్తి, కన్నన్, ఆప్పాల, సుబ్రీ తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీని గెలిపించండి'

ప్రజాశక్తి-నగరి: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని గాలి భానుప్రకాష్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆయన నగరి మున్సిపాలిటీలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. ఆ మేరకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ బాబు, శ్రీనివాసన్, సురేష్, మోహన్, ఏసుముతు, రవి, సుశీల్, దినేష్, కేశవులు, కృష్ణారెడ్డి, ఆర్ముగం, రమేష్ పాల్గొన్నారు.

19న 'రా..కదలిరా..' భారీ సభ
వెంకటగిరికి చంద్రబాబు రాక

ప్రజాశక్తి -వెంకటగిరి : ఈ నెల 19 తేదీన వెంకటగిరి లో 'రా.. కదలి రా..' భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రానున్నారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలో శనివారం టిడిపి సమావేశం ఏర్పాటు చేశారు. తిరుపతి పార్లమెంట్ లోని 7 నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, టిడిపి జిల్లా నాయకులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి , మాజీ మంత్రి నెలవల సుబ్రహ్మణ్యం, గూడూరు మాజీ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్, జిల్లా ముఖ్య నాయకులు, జన సైనికులు ఈ సమావేశానికి హాజరై కార్యక్రమ ఏర్పాట్లపై చర్చిం చారు. అనంతరం మీడియా సమావేశంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 19న వెంకటగిరిలో నిర్వహిస్తున్న 'రా..కదలి రా..' సభకు చంద్ర బాబు రానున్నారని, లక్షల్లో ప్రజలు రాబోతున్నారని, ఎలా వారికి సౌకర్యాలు కల్పించాలో చర్చించామన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి రాష్ట్రాన్ని కెజిఫ్ -3 గా మార్చుకొని సిలికా , తెల్ల రాయి , ఇసుక వదిలి పెట్టకుండా అక్రమంగా దోచుకుంటూ వెంకటగిరి నియోజక వర్గం, సర్వేపల్లి , గూడూరు నియోజకర్గాన్ని కెజిఫ్ -3 గా మార్చేశారని విమర్శించారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీకి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందన్నారు.

'ప్రజలకు మెరుగైన వైద్యం అందించండి'



ప్రజాశక్తి-యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యశాల అందించాలని జాతీయ సభ్యులైన డాక్టర్ అర్జున్ బెనర్జీ తెలిపారు. శనివారం వరదరాజులపల్లి హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వారి గ్రామాల్లోని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు భాగంగా వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. చిత్తూరు జిల్లాలోని యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వరదరాజులపల్లి హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను జాతీయ నాణ్యత పరిమాణాల బృంద సభ్యులైన డాక్టర్ అర్జిత్ బెనర్జీ, డాక్టర్ కిరణ్ ఎస్‌జి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్ నిరంజన్‌రెడ్డిలు తనిఖీ నిమిత్తం వచ్చారు. వీరికి వరదరాజులపల్లి హెల్త్‌అండ్‌వెల్నెస్ సెంటర్ వద్ద యాదమరి వైద్యాధికారిణి డాక్టర్ సురేఖ, సిహెచ్ఓ లక్ష్మీనారాయణలు స్వాగతం పలికారు.

స్వర్ణోత్సవ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట గ్రామంలోని జెడ్పి ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలను శనివారం ఘనంగా ప్రారంభించారు. 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు మూడు రోజులపాటు స్వర్ణోత్సవ వేడుకలను పూర్వ విద్యార్థులు, పాఠశాలలో పనిచేసే రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులు, ప్రస్తుతం పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంయుక్తంగా కలసి గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు శనివారం విశ్రాంత ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, అనంతరం పలువురు వక్తల ప్రసంగాలు, పూర్వ విద్యార్థుల ప్రసంగాలు నిర్వహించారు. మొదటిరోజు పూజా కార్యక్రమం ప్రార్థన అధ్యక్షుల తొలి పలుకులు ముఖ్యఅతిథుల ప్రసంగాలు సన్మాన కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ, విశ్రాంత ఉపాధ్యాయులు రంగారెడ్డి, పూర్వ విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల వితరణ

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని విద్యా వనరుల శాఖలో సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సిఆర్‌పి, మెసెంజర్లకు యుటిఎఫ్ జిల్లా, ఎపిటిఎఫ్, పిఆర్‌టియు మండల నాయకులు నిత్యావసర వస్తువులు, బియ్యంను సంక్రాంతి సందర్భంగా శనివారం పంపిణీ చేశారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం, హరి, చెంచు రాజా, మండల నాయకులైన జయలక్ష్మి, విజయసాయిలు, రవీంద్రయ్య, వాసు, చినబాబు, శ్రీను, రమేష్, రవిచంద్ర, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ సమీపంలోని టిడ్కో అపార్టుమెంటు వద్ద సిఆర్ రెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ రోహిణి మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్య ఒక్కటే మార్గమని పిల్లలను బాగా చదివించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని లేకపోతే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు వందన, శశిరేఖ, దేవిక , సుందరయ్య, రత్నం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నిరుపేద ముస్లిం యువతికి శనివారం బొజ్జల కుటుంబ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈనెల 2వ తేదీ శ్రీకాళహస్తి పట్టణం 22 వ వార్డు పరిధిలోని యన్టీఆర్ నగర్‌లో బొజ్జల రిషితారెడ్డి ఆధ్వర్యంలో 'ఇంటింటికి మీ బొజ్జల' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో నివాసముండే నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన షేక్ బాబు, షేక్ హసీనా దంపతులు తమ కుమార్తె వివాహ ఏర్పాట్లలో ఎదుర్కొంటున్న ఇబ్బంది లు తెలిపారు. ఆ పేద కుటుంబం ఆర్థిక సమస్య ను అర్థం చేసుకున్న రిషితా రెడ్డి యువతి వివాహ ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సొమ్మును వారికి ఆ వార్డు టీడీపీ ఇంచార్జి నెమళ్ళూరు బుజ్జి, వార్డు అధ్యక్షులు పూల శేఖర్, బూత్ ఇంచార్జి చెంబేటి బాలయ్య, వార్డు కార్యదర్శులు నున్నా అనూష, షేక్ సులేమాన్, మెదూరు శివకుమార్ ద్వారా అందించారు.

గిరిజనులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -ఏర్పేడు : ప్రజా సాధికారిక సమితి ఆధ్వర్యంలో గుంజూస్ సంస్థ సహకారంతో నచ్చనేరి, చిందేపల్లి, రాజుల పాలెం, మరాఠిపురం గిరిజన కాలనీలలో షికార్లకు సంక్రాంతి పండుగ పురస్కరించుకొని నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి దేవేంద్ర కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్కరికి 1500 రూపాయలు విలువైన నిత్యావసర సరుకుల పంపిణీ చేశామని తెలిపారు. గుంజుస్ సంస్థ ప్రతినిధులు, స్థానిక సర్పంచ్ పెంచల య్య, ముని రామయ్య నాయకులు సిద్దయ్య, రంగయ్య, ఈశ్వరయ్య వాలంటీర్లు లక్ష్మీఅరుణ, మునికుమార్ ప్రజా ప్రగతి ట్రస్ట్ శ్రీకాళహస్తి డివిజన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, గిరిజన నాయకులు డబ్బా పరుశునాథ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వేటగాడి తూటాకి యువకుడు బలి

పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకీలు, ఉమాపతి మృతదేహం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వేటగాడి తూటాకి యువకుడు బలైన సంఘటన బంగారుపాళ్యం మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఎగువ కంతల చెరువు గ్రామానికి చెందిన యువకుడు ఉమాపతి (22) తన స్నేహితులు నాగరాజు, పాండ్యన్, శంకర్, వెంకటేష్‌తో కలిసి శుక్రవారం రాత్రి గ్రామ శివారు అటవీ ప్రాంతానికి వేటకు వెళ్లారు. అక్కడ వేటాడుతున్న సమయంలో నాగరాజు తుపాకీ తూటా ప్రమాదవశాత్తు ఉమాపతికి తగిలింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం అతని స్నేహితులు విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. విషయం తెలుసుకొని అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్నేహితులను అదుపులోకి తీసుకొని తుపాకీలను స్వాధీనం చేసుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ
- తల్లీ తనయుడు మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని తల్లి, కుమారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కేజీ సత్రం జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. సీఐ నాగరాజురావు కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం జిల్లేడుపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన చంద్రమ్మ (45), కుమారులు భరత్‌కుమార్ రెడ్డి(15), హేమంత్‌సాయి రెడ్డి(10) ముగ్గురు ద్విచక్ర వాహనంలో బంగారుపాళ్యంకు వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే తల్లి చంద్రమ్మ కుమారుడు హేమంత్‌సాయి మృతి అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నడుపుతున్న భరత్‌కుమార్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటనపై కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

సారా స్వాధీనం

ప్రజాశక్తి-సోమల: నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పొదలకుంట పల్లె పంచాయతీ తుగడంవారిపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్న స్థావరాలపై దాడి చేసి 400లీటర్ల ఊట, 25లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తొలగని చీకట్లు.. వెలగని వీధి దీపాలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల రామాలయం వీధి, దిగువ వీధి ప్రాంతాలలో గత వారం రోజులుగా వీధి దీపాలు వెలుగక పోవడంతో సంక్రాంతి పండుగ రోజు కూడా చీకట్లు తొలిగే పరిస్థితి లేదని ప్రజలు అనుకుంటున్నారు. గంగరాయి వద్ద నుండి పాత అమ్మయ్య వీధిలో వీధి దీపాలు వెలగక పోవడంతో అంధకారంలోని పండుగ చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ వారు వెంటనే వీధి దీపాలు వెలిగించి పండుగను చీకట్లలో నుండి వెలుగుకు తీసుకురావాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి-నగరి: స్థానిక కేవీకే మైదానం, డిగ్రీకళాశాల మైదానాల్లో జరిగిన మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు శనివారం ముగిసాయి. క్రికెట్‌లో ఎం.కొత్తూరు సచివాలయం టీం, వాలీబాల్‌లో గుండ్రాజుకుప్పం సచివాలయం టీం, బాడ్మింటన్‌లో కశింమిట్ట సచివాలయం టీం మండలస్థాయి విజేతలుగా నిలిచారు. విజేతలను మండల, మున్సిపల్ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలను మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంఈవో శ్రీదేవి, ఎంపీడీవో లీలామాధవి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సురేష్‌బాబు పర్యవేక్షించారు. నాలుగు రోజుల పాటు అంపైరింగ్ చేసిన 10 మంది యువకులను ప్రశంసించారు. మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయిలోను ప్రతిభ కనభరచాలన్నారు.

సదుంలో మకర జ్యోతికి ఘన ఏర్పాట్లు

ప్రజాశక్తి-సదుం: సదుం మండలం యర్రాతివారిపల్లిలో ఈ నెల 15 న జరగనున్న మకర జ్యోతి సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయాన్ని, ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుత్ అలంకరణలతో, వివిధ రకాల పూల తోరణాలతో అలంకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆర్‌టిసి బస్సులు సదుం అయ్యప్ప గుడికి స్పెషల్ బస్సులు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బట్టందొడ్డి నుంచి తిరుమలకు పాదయాత్ర

పాదయాత్ర చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి పంచాయితీలోని భక్తులు సింగల్ విండో మాజీ అధ్యక్షులు శంకరప్ప ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్రగా వెళ్లినట్లు శంకరప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ పంచాయితీలోని ప్రజలతో తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ సంవత్సరం సుమారు 200 మంది భక్తులతో పంచాయతీ నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళతన్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రామనపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో కొన్ని ఏళ్లుగా తాగునీటి సమస్యతో బాధపడుతూ ఉన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారంగా ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, సర్పంచ్ కృష్ణారెడ్డి అధ్యక్షతన నూతనంగా పైప్ లైన్ మరమ్మతు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, ఖాదర్‌బాషా, రాజేందర్, రఘురామిరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, మణిరెడ్డి పాల్గొన్నారు.

నగరి: మండలంలోని గుండ్రాజుకుప్పం ఆదిఆంధ్రవాడలో తాగునీటి సరఫరాకు రూ.6 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన తాగునీటి సరఫరాను మంత్రి ఆర్కే రోజా శనివారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో 75 కుటుంబాల వారు నివశిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ఎంపీపీ కన్నియప్ప, నిరంజన్‌రెడ్డి, దేవరాజులు రెడ్డి, డీఈ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్య సంరక్షణ : ఎమ్మెల్యే

పజాశక్తి - గూడూరు టౌన్ : ఆరోగ్య సంరక్షణకు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలను ప్రోత్సహిస్తూ కనుమూరు హరిచంద్ర రెడ్డి క్రికెట్ పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహించడం అభినందనీయమని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్ పేర్కొన్నారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో కనుమూరు హరిచంద్ర రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాస్టర్స్ క్రికెట్ లీగ్ పోటీలను ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, డిఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, నిర్వాహకులు కనుమరు హరిచంద్ర రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే, డిఎస్పి, క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసర మని గత 14 సంవత్సరాలుగా కనుమూరు హరిచంద్ర రెడ్డి మాస్టర్స్ క్రికెట్ లీగ్ పోటీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారన్నారు. డీఎస్పీ సూర్య నారాయణ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు ఎంతో మానసిక సంతృప్తి లభిస్తుందన్నారు. సంక్రాంతి సందర్భంగా ఇలాంటి క్రీడా పోటీలు జరగడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు కనుమూరు హరిచంద్ర రెడ్డి మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా నిరంతరం క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని పండుగ మూడు రోజులు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన మిత్రులు కూడా ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం సురేష్,రాజేంద్ర, నాగేశ్వర రావు, లవ కుమార్, విజయ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీతో సంక్రాంతి సందడి
- విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : తుమ్మల గుంటలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలో మహిళలు పోటా పోటీగా రంగవల్లులు తీర్చిదిద్ది కను విందు చేశారు. పదుల సంఖ్యలో మహిళ లు, విద్యార్థినులు పాల్గొన్న ఈ పోటీల్లో వేసిన ముగ్గులతో నేలపై హరివిల్లు విరిసింది. మహిళలు వేసిన ముగ్గులు అతిథులను, ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబం చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ అభినందించారు.

అరచేతి వేళ్లను కుంచెలుగా.. ఆకాశంలోని చుక్కలను అవనిపై చేర్చినట్టు అందమైన భావాలు కలిగిన అతివలు ముగ్గులు వేసి కనువిందు చేశారు. తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం ముందు ముత్యాల ముగ్గుల పోటీలు.. విశేషంగా ఆకట్టుకున్నాయి. అతివలు తమ ప్రతిభను అరచేతితో అందంగా ఆవిష్కరించిన తరుణంలో ముచ్చటైన ముగ్గులు వెల్లివిరిసాయి. తుమ్మల గుంటలో నిర్వహించిన ముగ్గుల పోటీ విజయవంతమైంది. ఈ పోటీలో చంద్రగిరి నియోజక వర్గంలోని మహిళలు, బాలికలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైన పోటీ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. న్యాయ నిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ ముగ్గులను ఎంపిక చేశారు. మహిళలు వేసిన ముగ్గులను గంట పాటు నిశితంగా పరిశీలించి ఉత్తమ ప్రతిభ కనబరచిన మూడు ముగ్గులను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి మిక్సీ, రెండవ బహుమతి కుక్కర్, మూడవ బహుమతి కిచెన్ సెట్, నాలుగవ బహుమతి సూట్ కేస్ లతో పాటు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు.

తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని మంగళం గ్రామపంచాయతీ బిటిఆర్ పురం సంక్షేమ సంఘం, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్వి ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, ఆల్ ఇండియా రేడియో ఆకుల మల్లేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి బహుమతులు అందించారు. మొదటి బహుమతి ఎం. నాగలత, రెండవ బహుమతి కే.లీలావతి, మూడో బహుమతి జి.కళ్యాణి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, రాధాకృష్ణ, రాంబాబు, చలపతి, మునిలక్ష్మి, తహ సున్నీసా బేగం, జయంతి, కల్పన, వెంకటేశం, గుణశేఖర్ , తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ సపోర్ట్‌తో టాలెంట్ స్ప్రింట్
మహిళా ఇంజనీర్స్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గ్లోబల్ ఎడ్‌టెక్ కంపెనీ, ట్రాన్స్‌ఫర్మేషనల్ డీప్‌టెక్ ప్రోగ్రామ్‌లను అందించడంలో మార్కెట్ లీడర్ టాలెంట్ స్ప్రింట్ మహిళా ఇంజనీర్స్ (డబ్ల్యుఈ) ప్రోగ్రామ్ లోని ఆరో ఎడిషన్‌ను ప్రారంభించింది. మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులకు 200 సీట్లను అందుబాటులోకి తీసు కొచ్చిందని గూగుల్ వీపి జీఎం శివ వెంకట రామన్ శనివారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈ కెరీర్ ప్రోగ్రామ్‌లో చేరే విద్యార్థులకు వంద శాతం స్కాలర్ షిప్‌తో పాటు స్కాలర్‌షిప్ సదుపాయం ఉందన్నారు. ఈ ప్రోగ్రామ్‌కి ఎంపికైన విద్యార్థులు గూగుల్ ఇంజ నీర్లతో మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్‌లకు యాక్సెస్ పొందు తారని మహిళా ఇంజనీర్లు తమ భవిష్యత్ సాంకేతిక ఉపాధి రంగాలకు బలమైన పునాదిని నిర్మించుకోవ చ్చున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సాంకేతిక పరి జ్ఞానాన్ని అన్ని కోణాలలో మహిళలను శక్తివంతం చేయడమే లక్ష్యంగా సాగు తుందన్నారు. డబ్ల్యుఈ ప్రోగ్రామ్ అనే ది అత్యంత ప్రభావ వంతమైన, టెక్ కెరీర్‌లను ఆశించే యువతులకు అవకాశాన్ని కల్పించడమే అన్నారు. టాలెంట్ స్ప్రింట్ ఫర్ ఉమెన్ ఇంజనీర్స్ ప్రోగ్రామ్ ద్వారా లింగ అంతరాన్ని తగ్గిస్తూ ఎన్నో అనుభవాలను నేర్పుతుందన్నారు. ఈ సందర్భంగా టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థా పక సీఈవో, ఎండీ డాక్టర్ శాంతను పాల్ మాట్లాడుతూ టాలెంట్ స్ప్రింట్‌లో ఔత్సాహిక మహిళా ఇంజనీర్లకు అవసర మైన వనరులు, అవకాశాలను కల్పించి, గత ఐదు కోహోర్ట్‌లలో లక్ష కంటే ఎక్కువ దరఖాస్తుదారుల్లో 950 మంది విద్యార్థులను తీసుకున్నామన్నారు. ఈ విద్యార్థులు గ్లోబల్ హ్యాకథాన్‌లలో కూడా పాల్గొన్నారని, అగ్రశ్రేణి సాంకేతిక సంస్థలలో ఇంటర్న్‌షిప్‌లు, అగ్ర విశ్వ విద్యాలయాలలో మాస్టర్స్ ప్రోగ్రామ్‌లను అభ్యసిం చారన్నారు. దరఖాస్తుల స్వీకరణకు జనవరి18 చివరి తేదీ అన్నారు. మరిన్ని వివరాల కోసం9963980259, 99591543 71 నంబర్లను సంప్రదించాలని కోరారు.